

'మాయమైపోయాడు' అందెశ్రీ



ప్రజాశక్తి - తిరుపతి సిటి

మానవత్వానికి పట్టం కట్టిన మట్టి పరిమళాల వాగ్గేయకారుడు అందెశ్రీ అని వక్తలు ఉద్ఘాటించారు. వేమన విజ్ఞాన కేంద్రం, సాహితీస్రవంతి సంయుక్త ఆద్వర్యంలో కవులు, సాహితీవేత్తలు పాల్గొని అందెశ్రీకి నివాళి అర్పించారు. వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.నాగార్జున మాట్లాడుతూ అక్షరాలు దిద్దని అక్షర శిల్పి అందెశ్రీ అని అన్నారు. ఆయన కన్నుమూయడం అత్యంత బాధాకరమన్నారు. ప్రముఖ రచయిత సాకం నాగరాజు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే మరణించిన అందెశ్రీ 'మాయమైపోయాడు' పాట ప్రపంచ పాటగా నిలిచిపోతుందన్నారు. ప్రముఖ జర్నలిస్టు రాఘవ మాట్లాడుతూ పాటకు పట్టాభిషేకం చేసిన అందెశ్రీ అపుడు మాయమైపోయాడంటే నమ్మబుద్ధి కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తోట వెంకటేశ్వర్లు, మన్నవ గంగాధరప్రసాద్; నాగరాజు, ఒ.వి రమణ, చిన్నం పెంచలయ్య ప్రసంగించారు. రాజు, కడివేటి మునిరత్నం, ప్రకాష్, సోమశేఖర అందెశ్రీ పాటలు పాడారు. టెంకాయల దామోదరం, గురునాధం, రెడ్డెప్ప, నెమిలేటి కిట్టన్న, మునిరాజు పాల్గొన్నారు.



చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్ష పదవులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దోబూచులాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో టిడిపి అధ్యక్ష పదవి రేసులో డజన్లకొద్దీ నేతలు పోటీ పడడంతో ఎవరికి ఇవ్వాలా అనే విషయమై సందిగ్ధంలో చంద్రబాబు తల పట్టుకుంటున్నారు. ఐవిఆర్ఎస్ సర్వే పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆశావాహులు అసంతృప్తి చెందుతున్నారు. వైసిపి హయాంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని కష్టకాలంలోనూ పార్టీని వీడకుండా ముందుకు తీసుకెళ్లిన నాయకులను విస్మరించి సామాజికవర్గీకరణ ప్రకారం పదవులు ఇవ్వడం ఏంటి? అంటూ చంద్రబాబును పరోక్షంగా విమర్శిస్తున్నారు.

బాబూ...ప్లీజ్..!

టిడిపి జిల్లా అధ్యక్ష పదవిపై... ఆశావాహుల్లో అసంతృప్తి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చిత్తూరు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు సిఆర్ రాజన్, గొల్ల నరసింహయాదవ్‌లకు పదవులు ముగిసి దాదాపు ఆర్నెళ్లు అవుతోంది. అయితే యాదవ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్‌గా నరసింహయాదవ్‌కు, వన్నెకులక్షత్రియ డెవలప్‌మెంట్ ఛైర్మన్‌గా సిఆర్ రాజన్‌కు రాష్ట్రస్థాయి ఛైర్మన్ పదవులు కట్టబెట్టారు. ఆ పదవులతో పాటు జిల్లా అధ్యక్ష పదవులూ ఇవ్వాలని వారిద్దరూ పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో చిత్తూరులో ఎన్‌పి ప్రకాష్‌నాయుడు, గీర్వాణి భర్త ప్రకాష్‌నాయుడు, పూతలపట్టుకు చెందిన సప్తగిరి ప్రసాద్, పాలసముద్రంకు చెందిన చిట్టిబాబునాయుడు తదితరులు పోటీలో ఉండడంతో ఆ జిల్లాలో ఎంపిక వాయిదా పడింది. తిరుపతి జిల్లాలో నరసింహయాదవ్‌తో పాటు, తెలుగు యువత నాయకులు శ్రీధర్‌వర్మ, మాజీ ఎంఎల్‌ఎలు ఎస్వీవి నాయుడు, నెలవల సుబ్రమణ్యం, పరసారత్నం, ప్రముఖ పారిశ్రామికవేత్త సతీష్‌రెడ్డి పోటీలో ఉన్నారు. అయితే ఐవిఆర్‌ఎస్ సర్వే నిర్వహించగా సిట్టింగ్ ఎంఎల్‌ఎలు, యువత ఎక్కువమంది శ్రీధర్‌వర్మ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. సర్వేలో 55 శాతం అనుకూలంగా వచ్చినట్లు సమాచారం. మిగిలిన అందరికీ కలిపి 40శాతం వచ్చింది. అయితే సందులో సడేమియా అంటూ కేంద్ర మాజీ మంత్రి మంత్రి పనబాక లక్ష్మి మహిళా కోటాలో తనకూ టిడిపి అధ్యక్ష పదవి ఇవ్వాలని అధినేత ముందు పట్టుబట్టి ఉన్నట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణ నేపథ్యంలో రెండు జిల్లాల్లో ఎస్సీలకు జిల్లా టిడిపి అధ్యక్ష పదవులు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. చిత్తూరు లేదా తిరుపతిలో వీరికి రిజర్వు చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చిత్తూరులో సప్తగిరి ప్రసాద్, తిరుపతి జిల్లాలో నెలవల సుబ్రమణ్యం, పరసారత్నం, పనబాక లక్ష్మిలకు చోటు దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. సామాజిక సమీకరణల నేపథ్యంలో ఆ ముగ్గురికి టిడిపి అధ్యక్ష పదవి కట్టబెడితే రానున్న 2029 ఎన్నికల్లో పార్టీ బలహీన పడుతుందని, అలాంటి సాహసాలు చేయవద్దని చంద్రబాబుకు సిట్టింగ్ ఎంఎల్‌ఎలు విన్నవించినట్లు సమాచారం. తిరుపతి జిల్లాలో టిడిపిలో యువత ఓటింగ్ శాతం ఎక్కువగా ఉందని, ఓటింగ్ శాతం బట్టి సామాజిక సమీకరణలో పదవులు ఇవ్వాలని టిడిపి ద్వితీయశ్రేణి నాయకత్వం రెండు బృందాలుగా వెళ్లి మంత్రి నారా లోకేష్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించినట్లు సమాచారం. ఎక్కువమంది అందరినీ కలుపుకుని పనిచేసే శ్రీధర్‌వర్మకు ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది.

కళత్తూరు దళితవాడకు సిపిఎం బాసట

శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్‌కు వినతి



సిపిఎం ఆధ్వర్యంలో వస్తువులు వితరణ

ప్రజాశక్తి - కెవిబిపురం

కెవిబిపురం మండల కేంద్రానికి దగ్గరలో ఉన్న కళత్తూరు దళితవాడ ప్రజలకు ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఓళ్లూరు దగ్గరలోని రాయలచెరువు కట్ట తెగి కళత్తూరు దళితవాడను, ఇతర గ్రామాల్లోని 700 ఇళ్లకు పైగా ముంచేసిందని, సర్వం కోల్పోయారన్నారు. ప్రభుత్వ సాయంతో కొంత బయట పడినప్పటికీ ఇది పూర్తి పరిష్కారం కాదన్నారు. ఈ విషయాన్నే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అక్కడి దళితవాడ ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తమ పార్టీ తీసుకెళ్లిందన్నారు. సురక్షితమైన ప్రాంతంలో ప్రత్యామ్నాయ స్థలాలు గుర్తించి ఇళ్లు కట్టించి పునరావాసం కల్పించాలన్నారు. అదిమాత్రమే శాశ్వత పరిష్కారమన్నారు. వందలాది గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, ఇంట్లో సామానులు నీటి పాలయ్యాయన్నారు. చివరకు భూమిపత్రాలు, పిల్లల చదువుల సర్టిఫికెట్లు సైతం లేవన్నారు. మిట్ట ప్రాంతంలో ఐదు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల వ్యవసాయ భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో వారికి ఇచ్చిన పట్టాలను ఆచరణ రూపం దాల్చేటట్లు ఫారెస్టు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మూడున్నర కోట్లు బురద తొలగించుకోడానికి, ఇతర నిత్యవసరాలకు మాత్రమే సరిపోతుంది తప్ప, కోల్పోయిన నష్టాన్ని భర్తీ చేయదన్నారు. గేదెకు 50వేలు, గోవుకు 40వేలు, మేకలు, గొర్రెలకు 30వేల లెక్కన పరిమారం చెల్లించాలని కోరారు. విద్యార్థులకు ఆధార్‌కార్డులు, సర్టిఫికెట్లు, భూరిజిస్ట్రేషన్‌పత్రాలు అన్నీ ప్రభుత్వమే ఉచితంగా అందేలా చూడాలని కోరారు. పూర్తి పునరావాసం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆదుకోడానికి స్వచ్ఛంద సంస్థలు, సిపిఎం, ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ విద్యార్థులు ముందుకొచ్చి మానవత్వం చాటుకున్నారన్నారు.

కళత్తూరుకు వర్సిటీ బస్సు కేటాయించిన రిజిస్ట్రార్



శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ ఆధ్వర్యంలో కళత్తూరు గ్రామంలోని వరద బాధిత విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ భూపతినాయుడు ప్రత్యేకంగా యూనివర్సిటీ బస్సును కేటాయించి, జెండా ఊపి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లోనే కాకుండా, సేవా కార్యక్రమాల్లోనూ ముందుండాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. విపత్తులు సంభవించినపుడు ప్రతి విద్యార్థి తనవంతుగా ప్రజలకు చేయూత ఇవ్వాలన్నారు. దాదాపు 140 మంది వరద బాధిత విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి, ఆఫీసు బేరర్లు అశోక్, వినోద్, పవిత్ర, రెడ్డికుమార్, నరసన్న, శ్రేష్ఠావళి పాల్గొన్నారు. గ్రామంలోని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను ఎంఇఒ ద్వారా అందజేశారు.

సిపిఎం ఆర్థిక సాయం

పుత్తూరు టౌన్ : సిపిఎం ఆధ్వర్యంలో దాతల నుంచి సేకరించిన నిత్యావసర వస్తువులను కళత్తూరు దళితవాడలో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, జిల్లా నాయకులు ఆర్.వెంకటేష్, కెవిబిపురం ప్రాంతీయ కార్యదర్శి నాగరాజు, మండల కార్యదర్శి మునిశంకర్, అంగన్‌వాడి జిల్లా కోశాధికారి రాజేశ్వరి ఆధ్వర్యంలో అందజేశారు. చీరలు, బకెట్లు, జగ్గులు, ప్లేట్లు, లుంగీలు, చిన్నపిల్లల డ్రస్సులు పంపిణీ చేశారు. దాతలైన పుత్తూరు కెవెల్ టెక్స్‌టైల్స్, ఆర్కెటెక్స్‌టైల్, ఇండియన్ సిల్క్ టచ్ స్టైల్స్, జాకీర్ హుస్సేన్ టెక్స్‌టైల్స్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.



జిల్లా రెవెన్యూ అధికారికి సిపిఎం వినతి



పోక్సో కేసులో.. నిందితుని రోడ్డుపై నడిపిస్తూ...

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

బాలికకు మాయ మాటలు చెప్పి లోబరుచుకుని, మూడు సంవత్సరాలుగా సహజీవనం సాగించిన నిందితుని ఈస్ట్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... నిందితుడు చెన్నంపల్లి జలపతి రెడ్డి ఓ ప్రైవేటు స్కూల్లో సోషల్ టీచరుగా పనిచేస్తున్నాడు. తన వద్ద చదువుకుంటున్న బాలికను మాయ మాటలు చెప్పి లోబరుచుకొని, గత మూడు సంవత్సరాలుగా రిలేషన్షిప్ కొనసాగిస్తున్నాడు. కూతురు తీరు పై మార్పును గమనించిన తల్లిదండ్రులు నిలదీయడంతో అసలు విషయం చెప్పింది. దీంతో ఖంగుతున్న తల్లిదండ్రులు తమ బిడ్డకు న్యాయం చేయాలను కోరుతూ ఈస్ట్ పోలీసులను ఆశ్రయించారు. డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో విచారణ చేపట్టి, మంగళవారం నిందితుని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ కోసం కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా ఈస్ట్ పోలీసు నుంచి కొంత దూరం నిందితుని రోడ్డుపై నడుచుకుంటూ తీసుకెళ్లారు. న్యాయమూర్తి ఆదేశాలతో నిందితున్ని తిరుపతి సబ్ జైలుకు తరలించారు.

వసతి గృహం నుంచి ఇద్దరు బాలికలు మిస్సింగ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి రూరల్ సాయి నగర్ పంచాయతీ, బైరాగిపట్టెడ లోని మాతశ్య వసతి గృహం నుండి ఇద్దరు బాలికలు పారిపోయిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలు వసతి గృహ నిర్వాహకుల కథనం మేరకు... జీవకోనకు చెందిన నక్షత్ర (12), గొల్లపల్లి కి చెందిన అలేఖ్య(8) సాయి నగర్ పంచాయతీలోని మాతస్య వసతిగృహంలో ఉంటున్నారు. సోమవారం రాత్రి బహిర్భూమికి వెళుతున్నామంటూ ఇద్దరూ గేటు వెలుపలికి వెళ్లారు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో వసతిగృహం డైరెక్టర్ తిరునగరు శ్రీదేవి పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు తిరుపతి రూరల్ సిఐ చిన్న గోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు, పిల్లల ఆచూకీ తెలిసినవారు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కోరారు. అయితే వసతి గృహంలో బహిర్భూమికి బయటకు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో మరి.

ఆలయంలో ఛైర్మన్ తనిఖీలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఢిల్లీ ఘటన నేపథ్యంలో భద్రతా సిబ్బందితో కలిసి పలుచోట్ల పర్యటించారు. అనుకోని ప్రమాదం జరిగితే తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భక్తులకు భరోసా ఇచ్చేలా భద్రతా చర్యలు ఉండాలని సూచించారు. అనంతరం పలు దుకాణాలను తనిఖీ చేసి భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యాపారాలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అమ్మవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబర్ 17 నుండి 25వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో పటిష్ట కార్యాచరణతో సక్సెస్ చేయాలని టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుచానూరు ఆస్థానమండంలో మంగళవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, టిటిడి సీవీఎస్వో కే.వి. మురళీకష్ణలతో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుచానూరు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఇప్పటికే రెండుమార్లు జిల్లా ఎస్పీ, టిటిడి సివిఎస్వో, టిటిడి జేఈవో సమీక్ష నిర్వహించారు. తిరుచానూరు ఆలయం పరిసరాలలోను, పద్మసరోవరం, హెూల్డింగ్ పాయింట్లు వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పంచమి తీర్థం రోజు దాదాపు 75 వేల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అందుకు తగ్గట్లు అన్నప్రసాదాలు సిద్ధం చేసుకోవాలని, పటిష్ట క్యూలైన్లు, జర్మన్ షెడ్లు, పారిశుద్ధ్య పనులు, వర్షం వచ్చినా భక్తులకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. దాదాపు 600 మంది పోలీసులు, 700 మంది టిటిడి సెక్యూరిటీ , 900 మంది శ్రీవారి సేవకులు, 2 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు సేవలు అందిస్తారన్నారు. అదేవిధంగా, రోజువారి 10 వేల మందికి అన్నప్రసాదాలు, పంచమి తీర్థం రోజున హెూల్డింగ్ పాయింట్లలో దాదాపు 25 వేల మందికి పైగా భక్తులు వేచియుండే అవకాశం ఉందన్నారు. తిరుమల తరహాలో విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు చేపట్టాలని సూచించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా కమాండ్ కంట్రోల్ సెంటర్ లో అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు చేపడుతారన్నారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకష్ణన్ వచ్చారని, పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము వస్తున్నారని చెప్పారు. తిరుచానూరులో భారత రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. టిటిడి జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈ నెల 17వ తేది సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ అర్చకులు బాబుస్వామి, మణికంఠ స్వామి, సీఈ టి.వి. సత్యనారాయణ, ఎఫ్.ఎ అండ్ సీఏవో బాలాజీ, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి ఉదయం 6.00 నుండి 9.00 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు.

10 పరదాలు అమ్మవారికి బహుకరణ:

హైదరాబాద్‌కు చెందిన స్వర్ణకుమార్ రెడ్డి ప్రతినిధులు అమ్మవారి ఆలయంలో మంగళవారం ఏడు పరదాలను, అదేవిధంగా తిరుపతికి చెందిన మణి 3 పరదాలను డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు బాబు స్వామికి దాత అందజేశారు. అమ్మవారి గర్భాలయంలో పరదాలను అలంకరించనున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం, సివిఎస్వో కెవి.మురళీకష్ణ, తిరుపతి జిల్లా ఎస్పి సుబ్బరాయుడు, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో ఎం. రాధాకష్ణమూర్తి, సూపరింటెండెంట్ రమేశ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.





తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పరిశీలన



ర్యాగింగ్ చేస్తే చర్యలంటూ అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

ర్యాగింగ్ పేరుతో మనోభావాలు దెబ్బతీయొద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి - క్యాంపస్

ప్రఖ్యాత శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు ర్యాగింగ్ మీద కాకుండా, తమ లక్ష్యం మీద దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం శ్రీనివాస ఆడిటోరియంలో యాంటీ-ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం స్టూడెంట్స్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో మానవతా విలువలను పెంపొందించడమే అసలు విద్యని అన్నారు. ర్యాగింగ్ పేరుతో తోటి విద్యార్థి మనోభావాలను దెబ్బతీయడం మానవత్వం కాదన్నారు. కొత్తగా యూనివర్సిటీలో అడుగు పెట్టిన విద్యార్థులను భయపెట్టకుండా, స్నేహపూర్వకంగా ప్రోత్సహించడం ప్రతి సీనియర్ బాధ్యతని, ర్యాగింగ్ ద్వారా ఎవరికీ ఆనందం రాదని, ఎదుటివారికి మానసిక క్షోభను కలిగిస్తుందని, అలాంటి ఘటనలు జరిగితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ర్యాగింగ్ ఘటనపై ఫిర్యాదు చేసిన వారికి పూర్తి రక్షణ, న్యాయం అందిస్తామని హామీ ఇచ్చారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య నరసింగరావు మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది విద్యార్థి జీవితాన్ని దెబ్బతీసే దుర్మార్గమైన అలవాటని, మన యూనివర్సిటీలో ప్రతి విద్యార్థి సురక్షిత వాతావరణంలో చదువుకునే హక్కు వుందని, ఆ హక్కుకు ఎవరైనా భంగం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, తిరుపతి డియస్పీ భక్తవత్సలం, ఆచార్య ఓవియస్ రెడ్డి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

డిపిటిఒను కలిసిన ఎస్సీ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన తిరుపతి రీజినల్ కమిటీ మంగళవారం జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్‌ను ఆ సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వి.మైఖేల్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చీఫ్ అడ్వైజర్‌గా వి.ద్వారక, రీజనల్ ప్రెసిడెంట్ గా బి.సురేష్ నాయక్, సెక్రటరీగా పి.శ్రీనివాసులు, కోశాధికారిగా బి.వెంకటేసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా డి.రమేష్ నాయక్ తో పాటు 50 మందిని వివిధ కార్యదర్శులుగా, ఆఫీస్ బ్యారర్స్ గా ఎన్నికైన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా ఆయనకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా డిపిటిఓ జగదీష్ మాట్లాడుతూ జిల్లా ప్రాముఖ్యతను తెలియపరుస్తూ తిరుపతి తిరుమల పవిత్రతను దష్టిలో పెట్టుకొని, శ్రీవారి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వారికి మెరుగైన సేవలు అందించాలని, అందరి సమిష్టి కషితో ఆర్టీసీని మరింత బలోపేతం చేసి ఆర్టీసీ కీర్తి ప్రతిష్టలను కాపాడాలని ప్రయాణికుల ఆదరాభిమానాలు పొందాలని ఆకాంక్షించారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును కాపాడుకుందాం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

' సంక్షేమ బోర్డును కాపాడుకుందాం' అని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు మునిరాజ, శ్రీనివాసులు పిలుపునిచ్చారు. తిరుపతి పాత మున్సిపల్ ఆఫీస్ కూడలి వద్ద నగర కమిటీ కార్యదర్శి టి. దాసు అధ్యక్షతన ఈనెల 20వ తేదీన కలెక్టర్ ఆఫీస్ వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని మంగళవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నందు 3,000 కోట్ల వరకు ఉన్నాయని, వాటిని సంక్షేమ బోర్డు నుండి ఇతర అవసరాలకు వాడకూడదని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని, భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా ప్రమాదంలో మరణించిన, అంగవైకల్యం పొందిన వారి పిల్లల వివాహాలకు, కాన్పులకు, మట్టి ఖర్చులకు పరిహారంగా ఇవ్వాలన్నారు. గత ఆరేళ్లుగా 12, 14 సర్క్యులర్ కారణంగా క్లైమ్‌లను నిలిపేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. తమిళనాడులో ప్రమాదవశాత్తు మరణిస్తే కార్మికులకు 10 లక్షలు ఇస్తున్నారని, ఇల్లు కట్టుకునేందుకు నాలుగు లక్షల రూపాయల సాయం చేస్తున్నారని, కేరళ ప్రభుత్వం 60 సంవత్సరాలు పైబడిన వారికి 1200 పెన్షన్ ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, నారాయణస్వామి, చిన్న, సుందరం తదితరులు పాల్గొన్నారు.



మొంథా బాధితులకు చేయూత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, వరదయ్యపాలెం

మొంథా తుపాను కారణంగా నష్టపోయిన చేనేత కుటుంబాలకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి చేయూతనందించారు. భాస్కరపేటలో ఉన్న 181 చేనేత కుటుంబాలు తుపాను కారణంగా ఉపాధిని కోల్పోయారు. వీరికి మంగళవారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో మంగళవారం నిత్యవసర వస్తువులతో పాటు 50 కిలోల బియ్యం ఉచితంగా అందజేశారు. మండలంలో చేనేత పై ఆధారపడి జీవిస్తున్న సుమారు 128 మంది చేనేత కార్మికులకు ఈ నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పాల్గొన్నారు.



ముక్కంటిని దర్శించుకున్న ఎమ్మెల్యే 'పంతం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మంగళవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టేసాయి ప్రసాద్ సాగర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, ధర్మకర్తల మండలి ఛైర్మన్ సాయి ప్రసాద్ ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.


శ్రీసిటీని సందర్శించిన జర్మనీ వాణిజ్య ప్రతినిధుల బృందం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం



జర్మనీలోని సాక్సోనీ రాష్ట్రానికి చెందిన 18 మంది వాణిజ్య ప్రతినిధుల బృందం శ్రీసిటీని సందర్శించింది. ఆ రాష్ట్ర వాణిజ్య, కార్మిక, ఇంధన, వాతావరణ శాఖ మంత్రి డిర్క్ పాంటర్ నేతత్వంలో పర్యటనకు విచ్చేసిన ప్రతినిధులకు శ్రీసిటీ ఛైర్మన్ శ్రీని రాజు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. 31 దేశాలకు చెందిన 240కి పైగా ప్రముఖ కంపెనీలకు నిలయమైన శ్రీసిటీలో జర్మనీకి చెందిన బెల్‌ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్, క్నాఫ్, కాంక్యోబర్ట్ పరిశ్రమలు సైతం ఉన్నాయని తెలిపారు.

చంద్రశేఖర్ రాజుకు పలువురి నివాళి




నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, ఎస్‌బిఆర్ పురం గ్రామానికి చెందిన పిఎస్ కృష్ణమ రాజు సోదరుడు పి ఎస్ చంద్రశేఖర్ రాజు (పుత్తూరు శాంతి థియేటర్ యజమాని)ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, పలువురు ప్రముఖులు మంగళవారం ఎస్ఆర్ పురంలోని వారి స్వగృహానికి చేరుకొని నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మణి రాజు, జడ్పిటీసీ మురళి రెడ్డి, మాజీ జడ్పీటీసీ సురేష్ రాజు, డాక్టర్స్ రవి రాజు, శ్రీనివాసుల రెడ్డి, శ్రీధర్ రాజు, నాయకులు ధనంజయలనాయుడు, చక్రపాణి రెడ్డి, జానా వెంకటయ్య, భాస్కర్ రెడ్డి, అమ్ములు (ఎలుమలై) విజయ బాబు, మాజీ మంత్రి రోజా సోదరులు రాం ప్రసాద్ రెడ్డి, డిఈఓ శేఖర్ మధనమోహన్ రెడ్డి, మాధవ రాజు, ప్రముఖులు, సన్నిహితులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలతో భక్తులకు ఇబ్బందులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, శ్రీ కామాక్షి సమేత శివాల య పాలకమండలి చర్యలు భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఆలయ ప్రాంగణంలో లింగాష్టకం పఠనం చేస్తున్న భక్తులను నిలదీయడం, మొబైల్ ఫోన్ ద్వారా శ్లోకాలు చదవకూడదని ఆంక్షలు విధించడం, లుంగీతో రాకూడదని నిబంధన పెట్టడం వంటి నిర్ణయాలు భక్తులకు ఇబ్బందికరంగా మారాయి. ఆలయంలో అర్చన, అభిషేకాల కోసం ఫోన్ పే లేదా ఆన్‌లైన్ ద్వారా డబ్బు స్వీకరిస్తున్నారని, కానీ సెల్ ఫోన్ ఉపయో గించి లింగాష్టకం చదవకూడదనే నిబంధన ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. కొత్త ప్రమిదలతోనే దీపాలు వెలిగించాలని నిబంధన కూడా ఇబ్బందికరంగా ఉందని ఆరోపించారు. రోజువారి తాగు నీటి బోరుకు కూడా తాళం వేయడం కూడా అసౌకర్యంగా ఉందని తెలిపారు. అయ్యప్ప స్వామి భక్తులకు ఈ బోరు ఎంతో సౌకర్యమని పేర్కొన్నారు. ఆయన ఈవోను వివరణ అడుగగా, తను కొత్తగా వచ్చానని, తనకు ఏమీ తెలియదని తెలుపడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

నీరు వృథా.. ఎవరికీ పట్టదా?



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ఆరేటమ్మ కాలనీ సచివాలయం వెనుక భాగంలో గత పదిహేను రోజులుగా నీటి కొళాయి విరిగిపోయి నిరంతరం నీరు వృథాగాపోతోంది. స్థానికులు పలుమార్లు ఈ విషయాన్ని సచివాలయ సిబ్బందికి తెలియజేసినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు స్పందించి కొళాయికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఢిల్లీ పేలుళ్లతో.. గూడూరులో తనిఖీలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పేలుళ్ల నేపథ్యంలో తిరుపతి ఎస్పి సుబ్బరాయుడు ఆదేశాల మేరకు గూడూరు మండల పరిధిలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. డిఎస్పి గీతా కుమారి సూచన మేరకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. గూడూరు రూరల్ పరిధిలోని జాతీయ రహదారి, ప్రధాన రోడ్డు మార్గాలు, ముఖ్యమైన కూడళ్లలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నియమాలపై రూరల్ ఎస్ఐ తిరుపతయ్య అవగాహన కల్పించారు.గూడూరు, పార్కింగ్ కార్యాలయం, పలు రద్దీ ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: నియోజకవర్గంలోని 58 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదలైన రూ.34,30,660 చెక్కులను సోమవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయానికి స్థలం కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తెలుగుదేశం పార్టీ తిరుపతి జిల్లా విభాగానికి సొంత స్థలం కేటాయించడం హర్షించదగ్గ విషయమని, దీనిపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని తిరుపతి పార్లమెంటు డివిజన్ టిడిపి అధ్యక్షులు, యాదవ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ సొంత కార్యాలయం లేకపోవడంతో తిరుపతి గ్రామీణ మండలం అవిలాల గ్రామపంచాయతీ రెవెన్యూ పరిధి 495 /5, 495/11లో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించడం స్వాగతిస్తున్నామన్నారు.

గుర్తింపు కార్డుల మంజూరుకు చర్యలు



ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం, జమీన్ కొత్తపాలెం పంచాయతీ, తూపిలిపాలెం గ్రామంలో మండల ఎంపీడీవో సాయి ప్రసాద్, ఎమ్మార్వో సయ్యద్ ఇక్బాల్ స్థానిక గిరిజన కుటుంబాలను పరిశీలించి, ఆధార్ కార్డులు, రైస్ కార్డులు లేనివారికి మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్, వీఆర్వో మరియు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రత నిబంధనలపై మంగళవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిఐ సంజీవ కుమార్, ఎస్ఐ విజయమ్మ మంగళవారం కళాశాలకు విచ్చేసి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వేగపరిమితి, ట్రాఫిక్ సిగ్నల్స్, లైసెన్స్, హెల్మెట్ వంటివాటిపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ పోలీస్ శాఖ సూచనలను తప్పకుండా పాటించాలన్నారు.

జిల్లా స్థాయి కౌశల్ పోటీ పరీక్షలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - పాకాల: మొగరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జోష్న, సమీన హప్పియా, పవన్ కుమార్‌లు ఈ నెల 10 వ తేదీ సాయంత్రం విడుదలైన కౌశల్ సైన్స్ క్విజ్ పోటీ పరీక్షా ఫలితాల్లో విజయం సాధించి, జిల్లా స్థాయి కౌశల్ పోటీ పరీక్షలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమలత తెలియజేశారు. విద్యార్థులను, సమన్వయకర్త వనపర్తి వెంకట సిద్ధులను ఆమె అభినందించారు. వెంకట సిద్ధులు మాట్లాడుతూ భారతీయ విజ్ఞాన మండలి, ఏపీ సైన్స్ సిటీ, ఆఫ్ కాస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 1,2,4 తేదీలలో ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదివే ఆసక్తి ఉన్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో కోడ్ తంత్ర ఆన్లైన్ సాఫ్ట్‌వేర్ ద్వారా కౌశల్ సైన్స్ క్విజ్ పోటీ పరీక్షలను నిర్వహించారని తెలిపారు. ఈ పోటీ పరీక్షలకు మొగరాల పాఠశాల నుండి 15 మంది విద్యార్థులు హాజరుకాగా నలుగురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు నవంబర్ 27, 28 తేదీల్లో నిర్వహించబోయే జిల్లా స్థాయి పోటీ పరీక్షలు అదే పాఠశాలలో ఆన్లైన్ పరీక్ష రాయవలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీజేసీ విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈ నెల 8,9,10 తేదీల్లో, అనంతపురం జిల్లా కందుకూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 19 సంవత్సరాల లోపు జూడో కరాటే విభాగంలో సీనియర్ సీఈసీకి చెందిన నవీన్, బైపీసీకి చెందిన మౌలాలి, జూనియర్ సీఈసీకి చెందిన ఫయాజ్, హెచ్ఈసీకి చెందిన వివేకానంద మొదటి స్థానాల్లో నిలిచి పసిడి పతకాలు పొంది ఉత్తర ప్రదేశ్‌లో జరుగు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. సీనియర్ బైపీసీకి చెందిన సోహెల్ భాష ఆరు కిలో మీటర్ల మారథాన్ పరుగు పందెంలో రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం సాధించి ఒడిశాలో జరుగు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సీనియర్ ఎమ్ఈసికి చెందిన వసంత్ కుమార్ రాష్ట్ర స్థాయి జూడోలో కాంస్య పతకాన్ని, సీనియర్ ఎమ్ఈసికి చెందిన సుబ్రమణ్యం కాంస్య పతకాన్ని సాధించారు. పదిహేను సంవత్సరాల లోపు హాండ్ బాల్ పోటీల్లో జూనియర్ ఎంపిసికి చెందిన సుబ్రమణ్యం రజత పతకాన్ని సాధించాడు. మరి కొంత మంది విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రకాష్ బాబు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ సదస్సును సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సుభాష్ పాలేకర్ ఆవిష్కరించిన 5 అంచల వ్యవసాయ పద్ధతిని, వాన నీటి పరిరక్షణ భూగర్భ జలాల సద్వినియోగం మొదలగు విషయాలను స్థానిక రైతులకు తెలియపరిచేందుకు గీతా మందిరం వేదికగా రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో సుభాష్ పాలేకర్ పాల్గొంటారు. రైతులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తహశీల్దార్ శ్రీదేవి తెలియజేశారు. ఎంపీడీవో వెంకట రత్నమ్మకు 9000487879కి ముందుగా ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకుని శనివారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం, వెలుగు ఏపిఎం మునయ్య, ఎం.ఎన్.ఆర్.జి.ఎస్, ఏపీఓ దేవర తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలకు ఘన స్వాగతం



ప్రజాశక్తి - నాయుడుపేట: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పదంలో ఎంతో ముందుకు వెళుతుందని, నిరుద్యోగాన్ని పూర్తిగా రూపుమాపడానికి కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎన్నో కంపెనీలు రాష్ట్రానికి రానున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పెళ్ళకూరు మండలం, శిరసనంబేడు వద్ద జరగనున్న ఈ ఎం.ఎస్.ఎం పార్క్ శంకుస్థాపన, మరికొన్ని కంపెనీల ప్రారంభోత్సవాల కోసం మంగళవారం నాయుడుపేటకు విచ్చేసిన మంత్రి నిమ్మల రామానాయుడుకు నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పలువురు తెలుగుదేశం నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రి నెలవల సుబ్రహ్మణ్యం నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నెలవుల విజయశ్రీ ఎంపీ నెలవుల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బలిజ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు పగడాల దిలీప్ కొంతమంది సభ్యులతో కలిసి టిడిపిలో చేరారు. మంత్రి వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కట్ట వెంకటరమణారెడ్డి, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, పట్టణ టిడిపి నాయకులు మైలారి రాజశేఖర్, హంస పృథ్వి చంద్, తిరుపతి జిల్లా టిడిపి యువత ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, గాలి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు



ప్రజాశక్తి - వరదయ్యపాలెం : ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు మండల అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఉద్దేశం తో ఏర్పాటు చేసే సర్వసభ్య సమావేశం మండలంలో పసలేని సమావేశంలా వెలవెలా పోయిం ది. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభ తీరు అలానే ఉంది. సర్పంచులు, ఎంపీటీసీలు పూర్తిస్థాయిలో సమావేశానికి హాజరైనప్పటికీ అనేక శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజరవడంతో సమావేశం నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ఇందులో ముఖ్యంగా వ్యవసాయ శాఖ సంబంధించి యూరియా కొరతను అధికారుల దృష్టికి తీసుకుని వచ్చే ప్రయత్నం చేశారు. పశుసంవర్ధక శాఖ అధికారులు మాట్లాడుతూ మొక్కజొన్న, సజ్జలు వంటి పంటలకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీల గురించి వివరించారు. సొంతింటి కలలను నిజం చేసుకునే విధంగా గతంలో ఉన్న ఎస్సీ, బీసీలకు 1,80,000 నుండి ఇంకొక 50,000 అదనంగా ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ తెలిపారు. ఎస్టీలకు అయితే మరో అదనంగా 75 వేల రూపాయలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు సమావేశానికి రాకపోవడంతో సర్పంచులు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో ప్రసాద్ సర్దుబాటు చేయడంతో సమావేశం తిరిగి ప్రారంభమైంది. ఇకపై అన్ని శాఖల అధికారులు హాజరైతేనే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎంపీపీ పద్మప్రియ, సింగిల్ విండో చైర్మన్ ఆణిముత్యం నందకిషోర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, తూకివాకం పంచాయతీ పరిధిలోని ఇల్లు కోల్పోయిన 51 మందికి మంగళవారం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణంలో ఇల్లు కోల్పోయిన పేదలకు 2.5 ఎకరాలలో స్థలంలో పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు. అక్కడ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీమండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, భాస్కర్ యాదవ్, కన్నన్ రెడ్డి, డి విశ్వనాథన్ తదితరులు మండల నాయకులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ



ప్రజాశక్తి - నాయుడుపేట: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పెళ్ళకూరు మండలంలోని అక్కగారిపేట గ్రామంలో మంగళవారం పెళ్ళకూరు జడ్పిటిసి సభ్యులు నన్నం ప్రిస్కిల్లా స్థానిక వైసీపీ నేతలతో కలిసి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిల ఆదేశాలతో కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణకు చేస్తున్న కుట్రలను కోటి సంతకాలు పూర్తి చేయడం ద్వారా అడ్డుకుంటామని తెలిపారు. అనంతరం స్థానిక వైసీపీ నాయకులతో కలిసి అక్కగారిపేట గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, సత్యవేడు నియోజకవర్గ ఇంచార్జ్ నూకతోటి రాజేష్ సూచనలతో, బి.ఎన్. కండ్రిగ మండల అధ్యక్షుడు కె. మణి నాయుడు నాయకత్వంలో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల క్రియాశీలక కార్యదర్శి జొన్నల గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ బాబు రెడ్డి సంజీవయ్య ఇతర నాయకులతో కలిసి రాచెరువు గోవిందప్ప నాయుడు కండ్రిగ, చిన్నయుగుంట, పెద్దపాలివేడు గ్రామాలలో కోటి సంతకాల సేకరణ చేపట్టి రచ్చబండ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, నిరంజన్ రెడ్డి, అజయ్ రెడ్డి గురునాథం జై చంద్ర నాయుడు సుబ్రమణ్యం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సొంత ఇంటి కల సాకారం.. సప్తగిరి కన్‌స్ట్రక్షన్స్‌తో సాధ్యం

సప్తగిరి కన్స్ట్రక్షన్స్ మేనేజింగ్ పార్టనర్ టి. సురేష్ కుమార్



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : టెంపుల్ సిటీ తిరుపతి అభివృద్ధి చెందుతున్న నివాస ప్రాంతాలలో ఒకటి. ఈ ప్రాంతం బాగా నిర్మించిన వెడల్పైన రోడ్ల ద్వారా నగరంలోని ప్రధాన ప్రాంతాలకు అద్భుతమైన రోడ్డు కనెక్టివిటీని అందిస్తుందని సప్తగిరి కన్స్ట్రక్షన్స మేనేజింగ్ పార్టనర్ టి. సురేష్ కుమార్ తెలిపారు. స్థానిక శెట్టిపల్లి పద్మావతి ఫ్లోర్ మిల్ రైల్వేగేట్ ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న సప్తగిరి బిల్డర్స్ అండ్ అపార్టుమెంట్ కార్యాలయం వద్ద ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ, తిరుపతిలోని ప్రఖ్యాత ప్రాపర్టీ డెవలప్మెంట్ కంపెనీలలో సప్తగిరి కన్స్ట్రక్షన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఒకటన్నారు. డెవలపర్ తన కస్టమర్లకు చక్కగా నిర్మించిన గృహాలను అందించడం ద్వారా గౌరవాన్ని నిలబెట్టడానికి కట్టుబడి ఉన్న మేనేజర్లు, విక్రయదారులు, ఇంజనీర్లతో కూడిన ప్రత్యేక బృందం సప్తగిరి కనస్ట్రక్షన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సొంతమన్నారు. సప్తగిరి కన్స్ట్రక్షన్ ఇరా హిల్ వ్యూలో జీవితం మిమ్మల్ని కొత్త స్థాయికి తీసుకెళ్తుంది. థ్రిల్, ఉత్సాహం, సౌకర్యాలు మీ సొంతం. సప్తగిరి కన్స్ట్రక్షన్ ఇరా హిల్ వ్యూ అనేది 4 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 335 యూనిట్లతో, ఆధునికమైన 2, 3 బెడ్రూమ్స్ అపార్ట్మెంట్లను అందించే హై-ఎండ్ హౌసింగ్ ప్రాజెక్ట్. ఇరా హిల్ వ్యూ అనేక ప్రపంచ-స్థాయి సౌకర్యాలను ప్రదర్శిస్తుంది. ల్యాండ్ స్కేప్ గార్డెన్, పవర్ బ్యాకప్, లిఫ్ట్, కార్ పార్కింగ్, మెగా కెమెరా, క్లబ్ హౌస్, జిమ్, జాగింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, మురుగునీటి శుద్ధి కర్మాగారం మొదలైనవి అందుబాటులో ఉన్నాయన్నారు. సీనియర్ సిటిజన్ సిట్టింగ్ ఏరియా, విశాలమైన గార్డెన్, అవుట్ డోర్ గేమ్స్ ఇండోర్ గేమ్స్, జిమ్లెవ్ ఎలివేటెడ్ ఇది వినియోగదారుల కోసం ఒక అద్భుతమైన జీవనం అని తెలిపారు. కళాశాలలు, ఆసుపత్రులు, ఇతర వాణిజ్య, వినోద కేంద్రాలు వంటి అనేక ప్రముఖ ప్రజా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. శెట్టిపల్లి తిరుపతిలో అభివృద్ధి చెందుతున్న నివాస, వాణిజ్య ప్రాంతం. ఈ ప్రాంతానికి నగరంలోని ప్రధాన ప్రాంతాలకు అవధులు లేని కనెక్టివిటీని ఆస్వాదిస్తోంది. శెట్టిపల్లిలో అనేక ఎత్తైన అపార్ట్మెంట్లు, నిర్మాణంలో ఉన్న రెసిడెన్షియల్ డెవలప్మెంట్ ప్రాజెక్టు తమ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని తెలిపారు. తిరుచానూర్ రైల్వే స్టేషన్ శెట్టిపల్లి నుండి 4 నిమిషాల దూరంలో ఉంది. ఇది నగరంలో మంచి రైలు కనెక్టివిటీని అందిస్తుంది. శ్రీ వెంకటేశ్వర అంతర్జాతీయ విమానాశ్రయం కూడా శెట్టిపల్లికి కేవలం 10 కిలోమీటర్లు. అలిపిరి 10 కిలోమీటర్లు, ఆర్ టిసి బస్టాండు 5 కి.మీ దూరం. అన్నిటికి సెంటర్ పాయింట్లైన శెట్టిపల్లి వద్ద తమ నిర్మాణాలు, అత్యంత ఆకర్షణీయంగా, నాణ్యతగా, ఆహ్లాదకర వాతావరణంలో జరుగుతున్నాయని వెల్లడించారు. మన్నిక, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా చేపట్టిన నిర్మాణాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9885436104 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

సప్తగిరి కన్స్ట్రక్షన్స్ ప్రత్యేకతలు..

- వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాస ప్రాంతం.
- అద్భుతమైన వెంటిలేషన్.
- తిరుపతి రైల్వే స్టేషన్‌కు 6.4 కి.మీ .
- అలిపిరి (తిరుమల) గేట్ కు 10 కి.మీ.
- తిరుపతి విమానాశ్రయానికి 10.7 కి.మీ
- 5.7 కి.మీ. తిరుపతి బస్ స్టాండ్.
- ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీ లివింగ్.

సైబర్ వలకు చిక్కిన రైతు

అకౌంట్ నుండి రూ.7.50 లక్షలు కాజేసిన నేరగాళ్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సైబర్ నేరుగాళ్ల వలలో ఓ రైతు చిక్కడంతో అతని అకౌంట్ నుంచి ఏడు లక్షల 50 వేల రూపాయలు కాజేసిన ఘటన తిరుపతి రూరల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు అన్నమయ్య జిల్లా, పుల్లంపేట మండలంలోని ఎగువ రెడ్డిపల్లికి చెందిన రైతు తన పిల్లల చదువుల కోసం తిరుపతిలో నివాసం ఉంటున్నాడు. తిరుపతి రూరల్ ఓటేరు పంచాయితీలోని శ్రీవాణి నగర్‌లో నివసిస్తున్న రైతు ఫోన్ నెంబర్ వాట్సప్‌కు పిఎంజెవై కిసాన్ యోజన పథకం పేరుతో ఉన్న లింక్ వచ్చింది. రైతు లింక్ ఓపెన్ చేయడంతో వ్యక్తిగత వివరాలను సైబర్ నేరగాళ్ళు అడిగి తెలుసుకున్నారు. అంతే రైతు అకౌంట్లో ఉన్న 10 లక్షల 81 వేల రూపాయలలో 7.50 లక్షల నగదు విత్ డ్రా అయినట్టు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. వెను వెంటనే బాధితుడు 1930కు కాల్ చేసి తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లను సంప్రదించి, విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతిలేని అదనపు అంతస్థు నిర్మాణం తొలగింపు




ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధి, రెడ్డి గుంట ప్రాంతంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అదనపు అంతస్థు నిర్మాణాన్ని మంగళవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది తొలగించారు. అనుమతులు లేకుండా అదనపు అంతస్థు నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశాల మేరకు పరశీలించామని డిసిపి ఖాన్ తెలిపారు. అక్కడ జరుగుతున్న అదనపు నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేక పోవడంతో నిర్మాణాలను తొలగించామని తెలిపారు. అదనపు అంతస్తుల నిర్మాణాలు చేయదలచిన వారు టిడిఆర్ బాండ్లతో చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు మూర్తి, మధు, టిపిఓ వంశీ, టిపిబిఓ శరన్ రాజ్, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

నేడు వైసీపీ నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే ప్రభుత్వ యత్నాలకు వ్యతిరేకంగా, సత్యవేడు కేంద్రంగా వైస్సార్సీపీ ఇంచార్జ్ నూకతోటి రాజేష్ అధ్యక్షతన బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు మణి నాయుడు తెలిపారు. మండల పరిధిలోని ప్రజలూ, వైస్సార్సీపీ కార్యకర్తలూ, ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వివాహేతర సంబంధం వివాదంలో పసికందు మృతి



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి పట్టణంలో వివాహేతర సంబంధం వివాదంలో సంవత్సరం వయసున్న పసికందు మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు మదనపల్లె సమీపంలో బి.కొత్తకోటకు చెందిన క్రిష్ణానాయక్, ప్రసన్నకు వివాహమై 8సంవత్సరాలు అయ్యింది. వీళ్ళు చంద్రగిరిలో మూలస్థాన ఎల్లమ్మ ఆలయం సమీపంలో కాపురం ఉంటున్నారు. గత సంవత్సరం జూలై 31వతేదిన క్రిష్ణానాయక్ మృతి చెందాడు. అప్పటికే ప్రసన్న గర్భవతిగా ఉండటంతో వీరికి ఒక పాప పుట్టింది. పాప దీక్షితాప్రియ(1). మండలంలోని మిట్టపాలెంకు చెందిన సుబ్రమణ్యం తిరుపతి, కొర్లగుంట నివసిస్తున్నాడు. సుబ్రమణ్యంకు, ప్రసన్నకు వివాహేతర సంబంధం కొనసాగుతుండటంతో మంగళవారం సుబ్రమణ్యం భార్య ఉమా, మరో మహిళ దుర్గ వచ్చి ప్రసన్న ఇంటి వద్ద గొడవ పడ్డారు. అంతేకాకుండా ప్రసన్న చేతిలో కుమార్తె దీక్షితాప్రియ ఉన్న సమయంలో ఉమా దాడి చేసింది. ఈదాడిలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడంతో వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా ఓరిజనల్ డ్యాకుమెంట్ పోయినది

నేను అనగా గోగినేని చంద్రశేఖర్ తండ్రి రవీంద్రబాబు నా అక్క గోగినేని రత్నకుమారి భర్త నాగబోయిన వాసుకు సంబంధించిన డ్యాకుమెంటు నెం.213/2024, అమ్మనబ్రోలులో రిజిష్టరు జరిగిన ఓరిజనల్ కాపీలు జెరాక్స్ చేసుకొని తిరుపతిజిల్లా, వెంకటగిరిపట్టణ పరిధిలోని స్థానిక పి.వి.మెస్ నందు భోజనం చేసిన తరువాత మాకు చెందిన డ్యాకుమెంట్, పాన్‌కార్డు, ఆధార్‌కార్డులు పోయినట్లు గుర్తించినాము. ఈకాపీలు ఎవరికైన దొరికితే నా నాఅడ్రస్ ఉప్పుగూడూరు, ప్రకాశంజిల్లా. సెల్.నెం.6300274282కు చేయగలరు.

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-cum- X ADDITIONAL DISTRICT JUDGE:: TIRUPATI

M.V.O.P.NO.132 OF 2024

Gundala Manasa and 4 others **...Petitioners**

Vs.

T Sai Prakash and 2 others. **...Respondents**

Notice to the Respondents No 1and 2

1) T. Sai Prakash, (Driver), S/o. Subramanyam, R/o Korlagunta, Tirupati Town,)

2) Sd. Mohammed Gouse (Owner), S/o.Ameer Saheb, R/o D.NO.19-9/27/A3 RC.1. Lakshmipuram, Tirupati

Sir, Please, Take Notice that the Accident O.P. was filed by the Petitioner, posted on 18-11-2025 for your appearance. Please attend on that day before the above said court by 10.30 a.m., and file your objections if any. Otherwise the matter will be decided Exparte.

Sd/- M.JAYA CHANDRA REDDY
Advocate for Petitioner
Cell: 9440763887

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఒకరు మృతి, మరొకరికి గాయాలు



చికిత్స పొందుతున్న హనుమంతుడు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన ఘటన మంగళవారం వేకువజామున తిరుపతి రూరల్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్ పేరూరు గ్రామానికి చెందిన టి.వెంకట రెడ్డి(25), అతని సోదరుడు టి.హనుమంతుడు మంగళవారం వేకుజామున ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. తిరుపతి- చంద్రగిరి రహదారిలోని తిరుపతి రూరల్ పెరుమాళ్లపల్లి వద్ద వారు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావమైన వెంకటరెడ్డి అక్కడకే మృతి చెందగా, తీవ్ర గాయాలు పాలైన హనుమంతుడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తిరుపతి రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేసుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయా ఆసుపత్రికి తరలించి, మృతుడి భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు, స్వర్ణముఖి బ్యారేజ్ వద్ద మంగళవారం ఉదయం ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవర్ వీర రాఘవరెడ్డి పంబలి గ్రామం నుండి కోటకు వెళుతుండగా బ్యారేజ్ వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.4.73 లక్షలు జరిమానా

ప్రజాశక్తి -తిరుపతి బ్యూరో: తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు, తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ పర్యవేక్షణలో, రోడ్ యాక్సిడెంట్లు తగ్గించేందుకు చేపట్టిన ప్రత్యేక చర్యల్లో మంగళవారం తిరుపతి పట్టణ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు చేపట్టడం జరిగింది. మద్యం తాగి వాహనం నడిపిన 46 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 26 మందిపై కేసులు నమోదు చేయడం జరిగింది. తిరుపతి, అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి సంధ్యారాణి విచారణ జరిపి 46 మందికి ఒక్కొక్కరికి రూ.10,000/- చొప్పున మొత్తం రూ.4,60,000/- జరిమానా, 26 మందికి ఒక్కొక్కరికి రూ.500/- చొప్పున మొత్తం రూ.13,000/- జరిమానా విధించడం జరిగింది. మొత్తం రూ.4,73,000/- జరిమానా విధించబడింది.

తిరుమలలో దళారి వ్యవస్థపై ఉక్కుపాదం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుమలలో భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసే దళారి వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలన్న సంకల్పంతో, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఇదివరకే తిరుమల పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. భక్తులు ఎవరి ప్రలోభాలకు గురై మోసపోకుండా చూడడం పోలీస్ శాఖ యొక్క బాధ్యత అని పేర్కొన్నారు. దళారి వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక యాంటీ దళారీ టాస్క్ టీమ్‌ను తిరుమలలో ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో, తిరుమల 2 టౌన్ పోలీసులు దీర్ఘకాలంగా పరారీలో ఉన్న మోసగాడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీవారి దర్శనాలు, సేవా టిక్కెట్లు, వసతి గదులు ఏర్పాటు చేస్తానని చెప్పి యాత్రికుల వద్ద నుండి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసం చేసిన టీటీడీ ఉద్యోగి మాలే శంకరయ్యను ఈ రోజు మధ్యాహ్నం 1 గంట సమయంలో తిరుమల జెఇఓ కార్యాలయం సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు. తిరుమల దర్శనాలు, సేవా టిక్కెట్ల విషయంలో టిటిడి అధికారిక వెబ్‌సైట్‌ను ఉపయోగించాలని సూచించారు.

ఏపి ఎన్‌జిజిఓఎస్ సభ్యత్వ నమోదు



ప్రజాశక్తి -కోట : తిరుపతి జిల్లా ఏపి ఎన్‌జిజిఓఎస్ అసోసియే షన్ నాయకులు, వాకాడు తాలూకా నాయకులు కలిసి మంగళవారం కోటలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా నాయకులు కోట తహసీల్దార్ జయజయ రావు, ఎంపీడీఓ దిలీప్ కుమార్ నాయక్, వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్‌లను కలిశా రు. ఈ కార్యక్ర మంలో తిరుపతి జిల్లా నాయకులు, వాకాడు తాలూకా నాయకులు చైర్మన్ ఎస్.సురేష్ బాబు, జిల్లా కన్వీనర్ రఘు, డి.ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE MOTOR ACCIDENT'S CLAIMS TRIBUNAL -cum-V ADDITIONAL DISTRICT JUDGE:: TIRUPATI

M.V.O.P.NO. 73 OF 2024

G. Srinivasulu Naidu **...Petitioner**

Vs

1. Rathnam Chockalingam (Driver)
2. P.Mahesh Babu (Owner)
3. M/S. SBI General Insurance Company Limited, Rep.by its Manager, Mumbai.

... Respondents

NOTICE TO RESPONDENT NO.2

P.Mahesh Babu S/o. P.Ananda Reddy, Hindu, Owner of Maruthi Car Bearing No. AP AP 03 CT 2323,Cell No. 9441589856, residing at D.No. 2-6, Chitipiralla, Puthalapattu, Chittoor District,

Sir,

Please, TAKE NOTICE that the Accident O.P. was filed by the Petitioner and the same has been posted on 17-11-2025 for your appearance. Please attend on that day before the above said court by 10.30 a.m., and file your objections if any. Otherwise the matter will be decided exparte.

Hearing Date. 17-11-2025

Sd/-V.SUDHAKAR
Advocate for Petitioner

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P.No. 21/2022

ఏలూరు శ్రీధర్‌రెడ్డి **...పిటిషనర్**

VS

1.వేణుంబాక సాయి కుమార్ రెడ్డి
2. సూరి కాపురి పద్మ **...రెస్పాండెంట్స్**

టు:
వేణుంబాక సాయికుమార్ రెడ్డి, తండ్రి శ్రీనివాసులు రెడ్డి, రెసిడెన్స్ ఆఫ్ రవినగర్, కోట గ్రామం మరియు పోస్ట్, తిరుపతి జిల్లా. సెల్: 9949942607

నోటీసు

పై పిటిషనరు గూడూరు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు నందు పై పిటిషనరు పై కోర్టు నందు 1వ రెస్పాండెంట్ తన బాకీ చెల్లించకుండా తనకు చెందునటువంటి ఏకైక ఆస్థిని 2వ రెస్పాండెంట్ పై రిజిస్ట్రారు పత్రం వ్రాయించి యిచ్చినందున 1వ రెస్పాండెంట్‌ని ఇన్‌సాల్వెంట్‌గా డిక్లర్ చేయమని కోరుతూ పై పిటిషన్ దాఖలు చేసియున్నాడు.
సదరు పిటిషనుపై కోర్టువారు 13.11.2025వ తేదినకూ 1వ రెస్పాండెంట్‌కూ నోటీసు నిమిత్తం వాయిదా వేయబడింది. కావున 13.11.2025 తేది ఉదయం 10:30 గం॥లకు పై కోర్టు ఎదుట 1వ రెస్పాండెంట్ హాజరై ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల కోర్టువారు చట్ట ప్రకారం తగ్గు నిర్ణయాలు తీసుకొని ఉత్తర్వులు జారీ చేయుదురు.

ఇట్లు
కందనూరు వెంకట కృష్ణయ్య
పిటిషనరు తరపున న్యాయవాది, గూడూరు
సెల్ - 9440113977

ఆర్చరీ పోటీలకు శ్రీ ప్రగతి విద్యా సంస్థల విద్యార్థులు ఎంపిక



ప్రజాశక్తి -కోట : ఈ నెల 7, 8, 9 వ తేదీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో విలువిద్య క్రీడా పోటీలలో అండర్ 14 రికర్వ్ క్రీడా విభాగంలో శ్రీ ప్రగతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల 9వ తరగతి విద్యార్థిని నిశ్విత సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈమె ఈ నెల 18 నుండి 21 వరకు వారణాసిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అదేవిధంగా అండర్ 17 రికర్వ్ క్రీడా విభాగంలో శ్రీ ప్రగతి జూనియర్ కాలేజ్ విద్యార్థి చరణ్ కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. చరణ్ జనవరి 5 నుంచి 10 వరకు ఝార్కండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వకారణమని తెలియజేశారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను, కోచ్ శివశంకర్‌ను ప్రత్యేకంగా ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు.

ఘనంగా తూమాటి దొణప్ప శతజయంతి



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖ ఆధ్వర్యంలో ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి ఉత్సవ కమిటి సంయుక్త సహకారంతో "ఆచార్య తూమాటి దొణప్ప రచనలు- అద్వితీయత" అనే సదస్సు మంగళవారం నందమూరి తారక రామారావు భవనంలోని సెనేట్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమ అధ్యక్షులు, సదస్సు సంచాలకులు ఆచార్య కొలుకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని చేయవలసిందిగా ప్రోత్సహించిన తూమాటి సుధాకర్‌ని అభినందించారు. తూమాటి దొణప్ప రచనలలో ప్రశంసింపదగ్గ రచన " వైకృత పద భాషా స్వరూపం" అనీ అందులో అలంకారిక తీరు విశేషమనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.దామోదర నాయుడు, తూమాటి సుధాకర్, డా.మేడిసాని మోహన్, డా . పి.సి వెంకటేశ్వర్లు, డా.ఎన్. భీమన్న, డా.వై.సుభాషిణి, డా.డి.యువశ్రీ, ఆచార్యులు, విద్యార్థినిలు, సాహితీ ప్రియులు, బోధనేత సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీలు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణ పరిధిలో మంగళవారం స్కూలు బస్సులపై విస్తృత తనిఖీలు చేపట్టారు. పుత్తూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి పి. చంద్రశేఖర్, డీఎస్పీ గుమ్మడి రవికుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పున్నమి హోటల్ సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 40 బస్సులను తనిఖీ చేశారు. తనిఖీల్లో బస్సుల ఫిట్‌నెస్, బ్రేక్ వ్యవస్థ, టైర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు, అగ్నిమాపక కిట్లు వంటి అంశాలను పరిశీలించారు. కొన్నింటిలో గుర్తించిన మెకానికల్ లోపాలను బస్సు యాజమాన్యాలకు తెలియజేసి, అవి సరిచేసిన అనంతరం మళ్లీ తనిఖీ చేయనున్నట్లు వాహన తనిఖీ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. అన్ని స్కూలు బస్సులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడపడం తప్పనిసరని సూచించారు. విద్యార్థుల భద్రత అందరి బాధ్యతగా భావించి స్కూలు యాజమాన్యాలు, డ్రైవర్లు, అటెండర్లు, పేరెంట్స్ కమిటీలు కలిసి పిల్లల భద్రత కోసం కృషి చేయాలన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: విద్య ద్వారా దేశాభివృద్ధి సాధ్యమని నమ్మిన మహానుభావుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని డాక్టర్ బి. చంద్రమౌళి పేర్కొన్నారు. నవంబర్ 11 మౌలానా జయంతిని సందర్భంగా మంగళవారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ మౌలానా విద్యామంత్రిగా ఉన్న కాలంలోనే యుజిసి, ఐఐటీలు మొదలైన విద్యాసంస్థలు భారతదేశంలో రూపుదిద్దుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య, డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ సుజన, డాక్టర్ పి. హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగమ నాయుడు పల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 48 విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముజీబ్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో బిఈపిసి ఫౌండేషన్ సభ్యులు రియాజ్, అబ్దుల్లా, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, వసంత, విద్యా వాలంటీర్ సుప్రియ తదితరులు పాల్గొన్నారు

ఉపాధి శ్రామికుల ఈకేవైసీ పూర్తి చేయండి



ప్రజాశక్తి - రామచంద్రపురం : జిల్లాలో ఉపాధి హామీ జాబ్ కార్డ్స్ కలిగిన ఉపాధి శ్రామికులందరూ ఈ కేవైసీ చేసుకోవాలని, ఈ కేవైసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని డ్వామా పథక సంచాలకులు శ్రీనివాస్ ప్రసాద్ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని నెత్త కుప్పం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి శ్రామికుల సంఖ్యను పెంచాలని, పనులు నాణ్యతా ప్రమాణాలతో చేయించాలన్నారు. శ్రామికులకు రూ. 307 రూపాయలు వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలన్నారు. రామచంద్రపురం మండలంలో 87% మాత్రమే ఈ కేవైసీ ప్రక్రియ పూర్తయిందని, నెలాఖరులోగా 90 శాతం ఈ కేవైసీ పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సుజాత, జేఈ భాగ్యలక్ష్మి, సాంకేతిక సహాయకులు ఆరోగ్య, గోపి, క్షేత్ర సహాయకులు పసుపల పురుషోత్తం ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధనకు కృషి



ప్రజాశక్తి - బాలాయపల్లి : రానున్న పదవ తరగతి పరీక్షల్లో మండలంలోని ఉన్నత పాఠశాలలు మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని ఎంఈఓ 1 జి.నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం ఎమ్మార్వో కార్యాలయంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు, సిఆర్‌పిలతో విద్యారంగ కార్యక్రమాల నిర్వహణ, అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పదవ తరగతి పరీక్షలు ఉత్తమ ఫలితాలు సాధించడానికి 100 రోజుల ప్రత్యేక ప్రణాళికను అమలు చేయాలని నిర్దేశించిందన్నారు. ఈ మేరకు పదవ తరగతిలో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. మధ్యాహ్నం భోజనం అమలులో ఎటువంటి లోపాలు లేకుండా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంఈఓ 2 ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 5న పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను ఘనంగా నిర్వహించాలన్నారు. విద్యారంగ కార్యక్రమాల అమలులో బాలాయపల్లి మండలం మెరుగైన స్థానంలో ఉండటానికి అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, జాన్ పీటర్, రమణయ్య ఇంచార్జ్ ప్రధానోపాధ్యా యులు, కార్యాలయ సిబ్బంది బాబూరావు,శేషు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని కొమ్మనేటూరు పంచాయతీలో ఏపిఐఐసి ఆధ్వర్యంలో 48 ఎకరాల్లో ఎమ్ఎస్ఎమ్ఈ పార్కుకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్ఎస్ఎమ్ఈ పార్కు నిర్మాణం కోసం తొలి విడతగా 20 ఎకరాల్లో 9 కోట్ల 65 లక్షల రూపాయలతో పనులు జరుగుతాయన్నారు. మొత్తం ప్రాజెక్టు విలువ 129 కోట్ల రూపాయలుగా ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం చంద్రబాబు 110 ఎమ్ఎస్ఎమ్ఈ పార్కులకు శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఇంటికి ఒక పరిశ్రామిక వేత్తను తయారు చేయాలన్న ఉద్దేశంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. గతంలో ఏపీఐఐసి భూములలో అక్రమంగా గ్రావెల్, సిలికా తవ్వకాలు జరిగాయని, ప్రస్తుతం ఆ భూముల్లో క్రిస్ సిటీకి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్‌ల సారథ్యంలో నరేంద్ర మోడీ సహకారంతో రాబోవు రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. గూడూరుని నెల్లూరు జిల్లాలో కలిపి ఇందుకు అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మట్టం శ్రావణి రెడ్డి, రహీం, వెంకటేశ్వర్లు రాజు, సురేంద్ర, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది



ప్రజాశక్తి - వెంకటగిరి: సోషల్ మీడియా కార్యకర్తలనే కాదు.. వారి స్నేహితులను కూడా అక్రమంగా అరెస్టు చేస్తుండటం కూటమి సర్కారు పాశవిక విధానాలకు నిదర్శనమని వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలియజేశారు. ఎన్నారై మాలపాటి భాస్కర్ రెడ్డి కేసుకు సంబంధించి వైసిపి వెంకటగిరి రూరల్ సీనియర్ నాయకుడు కొండూరు వెంకటరత్నం రాజు కుమారుడు వైసిపి యువజన విభాగం నాయకుడు కొండూరు చంద్రశేఖర్ రాజును ఇటీవల పెనమలూరు పోలీసులు అరెస్టు చేసి విచారించి విడుదల చేసిన నేపథ్యంలో మంగళవారం చంద్రశేఖర్ రాజు కుటుంబ సభ్యులను నేదురుమల్లి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆత్మస్థైర్యం కోల్పోవద్దని పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టులపై చర్యలు వద్దు అని న్యాయస్థానాలు చెబుతున్నా, కూటమి ప్రభుత్వం ఆదేశాలను పెడచెవిన పెట్టి సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించే వారిని వేధింపులకు గురి చేయడం సరికాదన్నారు. చంద్రశేఖర్ రాజు అరెస్ట్ విషయం తెలిసిన వెంటనే స్పందించిన వైసిపి లీగల్ టీం అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ రాజశేఖర్, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త చక్రవర్తి స్పందించి అరెస్టయిన సాయంత్రంలోగా చంద్ర శేఖర్ రాజును విడుదల చేయించడం పట్ల నేదురుమల్లి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక తరగతుల పర్యవేక్షణ



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం ప్రారంభమైన రెండవ సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలను గాను మంగళవారం సాయంకాలం 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రైవేటు క్లాసులను విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం పరిశీలించారు. బుచ్చినాయుడుకండ్రిగ, కల్లివెట్టు, నెలవాయి ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. పరీక్షలన్నీ ఒకే పుస్తకంలో విద్యార్థులు రాసేలా మూల్యాంకనం పుస్తకాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూత్ లెవల్ అధికారులతో సమావేశం

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు స్త్రీ శక్తి భవనంలో మంగళవారం తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ ఓటర్ మ్యాపింగ్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అంశాలపై మండలంలోని బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని బస్టాండ్ ఆవరణలో మంగళవారం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ దామోదర్ నాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ హరి ప్రసాద్, ట్రైనింగ్ ఎస్సై సుధీర్ రెడ్డిల బృందం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ నాయుడు మాట్లాడుతూ వాహన చోదకులు రహదారి నియమాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రమేష్, సురేష్ హరి రేగన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనభోజనం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి కరకంబాడి రోడ్డులో వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో తిరుపతి రూరల్ అడపారెడ్డి పల్లె, స్వయంభూ నాగలింగేశ్వరస్వామి వారి ఆలయంలో వాకర్స్ సభ్యులచే మంగళవారం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వాకర్స్ సభ్యుల ఆరోగ్యానికి పూజలు చేయడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సాంబశివా రెడ్డి, కార్యదర్శి బాలాజీ నాయుడు, కోశాధికారి కృష్ణమూర్తి , రామస్వామి, సుబ్బారావు, సాయి కృష్ణంరాజు, శ్రీనాథరెడ్డి , సాయిబాబా రెడ్డి, శంకర్ రాజు, శాంతి, తనూజ పాల్గొన్నారు.

స్వామిత్వ ఇంటి నివేశన స్థలాల సర్వే



ప్రజాశక్తి -కోట : సిద్దవరం గ్రామ సచివాలయంలో ఇళ్లకూరుపాడు గ్రామానికి సంబంధించిన స్వామిత్వ గ్రామసభ సర్పంచ్ సుజాత అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 35 మంది గ్రామస్తులు గ్రామకంఠంలో ఉన్న వారి ఇంటి కొలతలను సరిచూసుకొని ఆమోదించారు. స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా వారికి యాజమాన్య హక్కు పత్రం త్వరలో ప్రభుత్వం వారిచే ఇవ్వబడుతుందని సర్పంచ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సిద్దవరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. కొత్తపట్నం సచివాలయాన్ని సందర్శించి సచివాలయ సిబ్బందికి ప్రభుత్వ సర్వేలు గ్రామ పంచాయతీకి సంబంధించిన పలు కార్యక్రమాలపై సూచనలు చేశారు.